క్లుప్తంగా

డ్రైనేజీ ఆక్రమణతో దుర్గంధం


గోశాల పక్కన డ్రైనేజీ ఆక్రమణతో నిలిచిపోయిన వ్యర్థాలు

కాకినాడ రూరల్: ఇండ్లలో వాడక నీరు పోయే మార్గం ఆక్రమణకు గురి కావడంతో ఇంద్రపాలెం గోశాల సమీపంలోని ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ ఆక్రమణను తొలగించి నీరుపారే మార్గాన్ని సుగమం చేయాలని స్థానికంగా నివాసం ఉంటున్న సింగంశెట్టి సత్య నాగలక్ష్మి, స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని సత్య నాగలక్ష్మి, స్థానికులు డ్రైనేజీ సమస్యపై మీడియాకు వివరించారు.

శ్రీనివాసులు సేవలు అభినందనీయం


డీడీ శ్రీనివాసులుకు జ్ఞాపిక అందజేస్తున్న సంఘం నాయకులు, ఉద్యోగులు

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసులు సేవలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ ఉద్యోగుల సంఘం అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు పాము శ్రీనివాసరావు అన్నారు. ఇటీవలి బదిలీల్లో భాగంగా డీడీ శ్రీనివాసులును ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ట్రెజరీ డీడీగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ట్రెజరీ కార్యాలయంలో గురువారం ఆయనకు వీడ్కోలు సభ నిర్వహించి, దుశ్శాలువ, పూలమాల, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ట్రెజరీ అధికారులు ఎం.సోమయాజులు, బి.భాస్కర్, వి.శశికుమార్, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాట్లకు రావిశాస్త్రి సాహిత్య పురస్కారం


దాట్ల దేవదానంరాజు

యానాం: విశాఖపట్నంలోని రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ ఏటా అందించే ప్రతిష్టాత్మక రావిశాస్త్రి సాహిత్య పురస్కారానికి ప్రముఖ కవి, కథకుడు.. యానాంకు చెందిన దాట్ల దేవదానంరాజు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం ఆయనకు ఆ సంస్థ నుంచి సమాచారం అందింది. స్థానికతను జోడించి వైవిధ్యమైన కథలు రచించినందుకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు కన్వీనర్ డాక్టర్ డీవీ సూర్యారావు లేఖలో పేర్కొన్నారు. జూలై 30న రాచకొండ విశ్వనాథశాస్త్రి జయంతి రోజున విశాఖ పౌర గ్రంథాలయంలో పురస్కార సభ జరుగుతుందని తెలిపారు. గతంలో రావిశాస్త్రి పురస్కారం స్వీకరించిన వారిలో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, ఓల్గా, విహారి, పాపినేని శివశంకర్, ద్విభాష్యం రాజేశ్వరరావు ఉన్నారు. ఈ సందర్భంగా దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ, సాహిత్య జీవితంలో కథలపై ఇష్టాన్ని, ప్రేమనీ కలిగించిన రావిశాస్త్రి పేరున ఇస్తున్న ఈ పురస్కారం ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు పి.విష్ణుమూర్తి, శిఖామణి, వరుగు భాస్కరరెడ్డి, చింతా కొండలరావు, మధునాపంతుల, పానుగుమట్ల అశోక్ తదితరులు దాట్లకు అభినందనలు తెలిపారు.

మండల ఉద్యాన శాఖాధికారిగా శైలజ

పెద్దాపురం: స్థానిక మండల ఉద్యాన శాఖాధికారిగా కె.సత్య శైలజ గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు పనిచేసిన ఎస్.సుజాత తుని మండలానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో పిఠాపురం మండల హెచ్ఓగా పనిచేస్తున్న శైలజను ఇక్కడకు హెచ్ఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆమె ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

రైల్వే భూముల్లో గడ్డి కోతకు 21న వేలం

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే భూముల్లో గడ్డి కోసుకోవడానికి ఈ నెల 21న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సీనియర్ సెక్షన్ ఇంజినీరు రామసుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సూచనల మేరకు రైల్వే సరిహద్దులలో సహజ సిద్ధంగా పెరిగిన గడ్డిని కోసుకోవడానికి 2025–26 సంవత్సరానికి సంబంధించి శనివారం మధ్యాహ్నం 3 గంటల సీనియర్ సెక్షన్ ఇంజినీరు కార్యాలయం వద్ద వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కడియం–కేశవరం, కేశవరం–ద్వారపూడి, ద్వారపూడి యార్డు, అనపర్తి–బిక్కవోలు, బిక్కవోలు–పీబీ దేవం, పీబీ దేవం–మేడపాడు, మేడపాడు–సామర్లకోట స్టేషన్ల మధ్య ఉన్న గడ్డికి సంబంధించి వేలం ఉంటుందన్నారు. వేలంలో పాటతో పాటు 18 శాతం జీఎస్టీ పాటదారులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చునన్నారు.

ప్రమాదకరంగా ఫ్లైఓవర్లు

- నిర్మాణాలపై బలహీనంగా రెయిలింగ్‌లు
- నిర్వహణ లేక దెబ్బతింటున్న వైనం
- రక్షణ గోడల్లో మొలుస్తున్న పిచ్చి మొక్కలు
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కాకినాడ లీగల్: అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. వారి నిర్లక్ష్యంతో కీలకమైన నిర్మాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఎదురవుతున్నాయి. నగరంలో ఎంతో కీలకమైన కాకినాడ వార్ఫ్‌రోడ్డు నుంచి జగన్నాథపురం వెళ్లే ఫ్లై ఓవర్‌పై రెయిలింగ్ కూలిపోయింది. ఈ వంతెన రెయిలింగ్ పగుళ్ల నుంచి మొక్కలు మొలుస్తున్నాయి. చాలా కాలంగా నిర్వహణకు నోచుకోకుండా, మరమ్మతులు కాక ప్రమాదకరంగా తయారైంది.

ఈ బ్రిడ్జిపై నిరంతరం భారీ వాహనాల ప్రయాణిస్తుంటాయి. వేలాది వాహనాలతో పాటు, పాదచారులు సైతం రాకపోకలు సాగిస్తుంటారు.


ఫ్లై ఓవర్‌పై కూలిపోయిన రెయిలింగ్

ఇది మరమ్మతులకు గురవుతున్నా అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో వంతెన దెబ్బతింది. అది ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. అధికారులు చర్యలు తీసుకుని రెయిలింగ్‌కు, బ్రిడ్జికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణికుల భయాందోళన

కాకినాడకు నలుమూలల నుంచి వచ్చేవారు ఈ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సుమారు 30 వేల నుంచి 50 వేల మంది వాహనాలతో వెళ్లి వస్తుంటారు. ఇటువంటి బ్రిడ్జికి మరమ్మతులు చేయకపోవడం దారుణమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బ్రిడ్జి రెయిలింగ్ వద్ద పడిపోయిన గోడ


బ్రిడ్జి రెయిలింగ్ గోడపై పెరిగిన మొక్కలు

కొత్త రెయిలింగ్ నిర్మించాలి

బ్రిడ్జి రెయిలింగ్ పూర్తిగా శిథిలమై దెబ్బతింది. కొంతకాలంగా ఆ ప్రాంతంలో మొక్కలు మొలిచి పెరిగిపోతున్నాయి. కార్పొరేషన్ సిబ్బంది ఏడాదికి ఒకసారి మొక్కుబడిగా ఆ మొక్కల కొమ్మలను నరికి వదిలేదస్తున్నారు. దీంతో మళ్లీ చిగురించి మొక్కలు ఏపుగా పెరిగిపోతున్నాయి. గోడల్లో పెరిగిపోతున్న ఈ మొక్కలను వేళ్లతో సహా తొలగించి మళ్లీ మొలవకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి.



– పువ్వుల ప్రసాద్, స్థానికుడు

అధికారులు పట్టించుకోవాలి

బ్రిడ్జి రెయిలింగ్‌కు మరమ్మతులు చేయించాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి రెయింలింగ్ పక్కన వస్తున్న మొక్కల తొలగింపునకు శాశ్వత చర్యలు చేపట్టాలి. అలాగే రెయిలింగ్‌ను పూర్తిగా తొలగించి పటిష్టంగా నిర్మించాలి.



– కె.దుర్గ ప్రసాద్, స్థానికుడు

సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయ వార్షికోత్సవ పూజలు

కరప: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో గురువారం వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. గ్రామంలో చాగంటి వంశీయులు 1818లో నిర్మించిన ఆలయం శిథిలం కావడంతో వంశపారంపర్య ధర్మకర్త, వీఆర్వోల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చాగంటి వెంకట్రావు 2011లో ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. ఏటా ఆలయ వార్షికోత్సవం పూజలు చేస్తున్నట్టు వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా చాగంటి వంశీయులు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు విలపర్తి సత్యకృష్ణ, రాధాకృష్ణమూర్తి స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజాదికాలు నిర్వహించారు. కరప పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

26 నుంచి వారాహి హోమాలు

బోట్‌క్లబ్: వారాహి నవరాత్రుల సందర్భంగా వేద విజ్ఞాన ప్రతిష్టానం ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి జూలై 5 వరకూ వారాహి హోమాలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ జ్యోతిష పండితులు పుసులూరి ఫణిశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రామారావుపేటలో ఉన్న ప్రతిష్ఠానం కార్యాలయ ప్రాంగణంలో ఆషాఢమాసం సందర్భంగా ఈ విశేష హోమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి

- ఎంపీడీఓ అనుపమ
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

కరప: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతులపై నివేదిక సమర్పించాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందికి ఎంపీడీఓ ఎం.అనుపమ ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె ఆ శాఖల సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్షించి చేయాల్సిన పనులపై సూచనలిచ్చారు. పాఠశాలల్లో తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుత్ సరఫరా తదితర వసతులు సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించాలని వారికి సూచించారు. నివేదిక ఆధారంగా ఆయా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయనున్నట్టు తెలిపారు. మండల పరిధిలో గృహ నిర్మాణాలు వేగవంతం చేసి, డిసెంబర్ నెలాఖరుకల్లా వాటిని పూర్తిచేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది డిసెంబర్ నెలాఖరునాటికి ప్రారంభించి, పునాదులు వేసుకున్న వారిని, వివిధ దశలలో నిర్మాణాలలో ఉన్న గృహాల యజమానులను కలసి వారిని చైతన్యపరచి, నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. మంజూరైన గృహాలు పూర్తి చేస్తే, కొత్తవి మంజూరు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. హౌసింగ్ ఏఈఈ పెండెం నాగేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాస్, కె.సహదేవుడు, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలల్లో వసతులు, గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ అనుపమ, హౌసింగ్ ఏఈఈ నాగేష్

ఉప్పాడ చేనేతకు చేయూత

కేంద్ర మంత్రికి ఎంపీ లేఖ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఉప్పాడ కొత్తపల్లిలోని చేనేత రంగం అభివృద్ధికి నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మంజూరు చేయాలని ఎంపీ టి.ఉదయ్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కేంద్ర టెక్స్‌టైల్స్‌శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్, కమిషనర్‌లకు రాసిన లేఖను ఇక్కడ పత్రికలకు విడుదల చేశారు. ఉప్పాడలో చేనేత రంగాన్ని అభివృద్ధిచేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు అనుసంధానం చేయాలని కోరారు. ఈ ప్రోగ్రాం ద్వారా రూ.15 కోట్లు విడుదల చేయాలని ఆ లేఖలో విజ్ఞప్తిచేశారు. కేంద్ర వాటా నిధులు రూ.12 కోట్లు మంజూరుచేసి తొలి వాయిదాగా రూ.3.5 కోట్లు విడుదల చేయాలని ఆయన అభ్యర్థించారు.

ఉపాధి పనులపై కేంద్ర బృందం ఆరా


సర్పంచ్ చిన్నా నుంచి వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

కాకినాడ రూరల్: మండలంలోని నేమాం, తిమ్మాపురం గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. రెండు గ్రామాలలో సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, రైతు భరోసా కేంద్రం, జగనన్న కాలనీలో అభివృద్ధి పనులు, పంట కాల్వల పూడిక తీత తదితర పనులను కేంద్ర బృందం సభ్యులు రుచి సిన్హా, బాల మురళి పరిశీలించి గ్రామస్తులు, ఉపాధి కూలీలతో మాట్లాడారు. నేమాంలో చేపట్టిన ఉపాధి పనులు గురించి సర్పంచ్ రామదేవు చిన్నా వివరించారు. అనంతరం పనుల వివరాలు, ఉపాధి కల్పన, తదితర అంశాలపై ఇన్‌చార్జి ఏపీఓ గణేష్ నుంచి వివరాలు సేకరించారు.

పేద విద్యార్థుల చదువుకు సాయం

కాకినాడ క్రైం: తండ్రిని కోల్పోయిన ముగ్గురు పిల్లల చదువుకు కాకినాడకు చెందిన రాజకీయవేత్త నున్న దొరబాబు రూ.50 వేల సాయం అందించారు. శ్రీ యువసేన స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా గురువారం ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ ఈ సాయాన్ని అందజేశారు.

గ్రామ పాలన ‘స్వర్ణ పంచాయతీ’లో నమోదు

కరప: గ్రామ పంచాయతీలు నిర్వహించే కార్యకలాపాలన్నీ స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయాలని డీఎల్‌పీఓ టి.అన్నామణి సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె మండల ప్రగతిని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. గ్రామాలవారీగా ఆన్‌లైన్ నమోదును పరిశీలించి, ప్రగతి తక్కువగా ఉన్నపంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి పంచాయతీల ఆస్తుల వివరాలు, ఇంటిపన్నుల విధింపు, వసూళ్లు తదితర లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో జరపాలన్నారు. గ్రామ పంచాయతీల ఆన్‌లైన్ నమోదును డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు డీఎల్‌పీఓకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరాన్ని ప్రాతిపదికగా చేసుకుని పంచాయతీల డేటా అంతా ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రతిదీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలన్నారు. ఇంటిపన్ను వసూళ్లు, కుళాయి పన్ను, ఆశీలు పాటల వివరాలు, ప్లాన్ అప్రూవల్ వంటి పంచాయతీల నిర్వహణ, ఆధార్ సీడింగ్ కార్యక్రమాలన్నీ సకాలంలో పూర్తిచేయాలని డీఎల్‌పీఓ అన్నామణి గ్రామ కార్యదర్శులకు సూచించారు.


పోర్టల్‌లో నమోదును డిప్యూటీ ఎంపీడీఓను అడిగి తెలుసుకుంటున్న డీఎల్‌పీఓ అన్నామణి

యూనిఫాం మెటీరియల్ అందజేత


యూనిఫాం మెటీరియల్‌ను హెచ్ఎంలకు అందజేస్తున్న ఎంఈఓ

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో గురువారం మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు కొత్తగా వచ్చిన యూనిఫాం మెటీరియల్‌ను ఎంఈఓ–1 కె.బుల్లికృష్ణవేణి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండల పరిధిలో 65 ప్రభుత్వ పాఠశాలల్లో 4,645 మంది విద్యార్థులకు యూనిఫాం మెటీరియల్ వచ్చిందన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలకు దానిని ఇవ్వడం జరిగిందని, శనివారానికి విద్యార్థులకు అందజేస్తారన్నారు. కుట్టు కూలి చార్జీలు తల్లుల అకౌంట్లలో జమ అవుతాయన్నారు. పాఠశాలలు తెరచిన వెంటనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, షూస్, బెల్టులు, టైలు అందజేసినట్టు తెలిపారు. ఈ ఏడాది నుంచి మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం సరఫరా అవుతోందని ఎంఈఓ తెలిపారు. సీఆర్పీలు పి.రాజు, పి.సత్యనారాయణ, బి.సారాకుమారి, వై.నాగలక్ష్మికుమారి తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్‌తో అప్రమత్తం

- డీఆర్వో వెంకటరావు
- వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సన్నాహాలు

కాకినాడ సిటీ: జిల్లాలో 0–40 సంవత్సరాల వయస్సు గల ఎస్టీ పాపులేషన్‌కు సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని దీని ద్వారా సికిల్ సెల్ కారియర్, సికిల్ సెల్ వ్యాధి కలిగిన వారిని గుర్తించవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అన్నారు. గురువారం ప్రపంచ సికిల్ సెల్ డిసీజ్ డేను పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్వహించిన ర్యాలీని కలెక్టరేట్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జె.నరసింహనాయక్ మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన తరువాత వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ వ్యాధిని అవగాహనతోనే నిర్మూలించగలమన్నారు. వివాహం చేసుకునేటప్పుడు సికిల్ సెల్ కారియర్, సికిల్ సెల్ వ్యాధి కలిగిన ఏ ఇద్దరూ వివాహం చేసుకోకూడదని కౌన్సిలింగ్ నిర్వహించాలని, ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే ప్రభుత్వం వారు ఉచితంగా అందిస్తున్న హైడ్రాక్సీ యూరియా టాబ్లెట్లను అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల నుంచి పొందవచ్చన్నారు. సికిల్‌సెల్ వ్యాధి కలిగిన వారు విధిగా రెగ్యులర్ చెక్ అప్స్ చేయించుకోవడం, పోషకాహారం తీసుకోవడం వల్ల జీవన నాణ్యత మెరుగుపడుతుందని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు ఆర్.రమేష్, సుబ్బరాజు, జిల్లా సికిల్ సెల్ నోడల్ అధికారి డాక్టర్ ఐ.ప్రభాకర్, జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.అరుణ, డీపీఎంవో డాక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో భాగంగా మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

హెమోగ్లోబిన్ లోపంతో సికిల్ సెల్ అనీమియా

బోట్‌క్లబ్: సికిల్ సెల్ అనీమియా అనే వ్యాధి హెమోగ్లోబిన్ అనే ప్రోటీన్ లోపం వల్ల వస్తుందని దీనికి ప్రస్తుతం వైద్యం లేదని ప్రముఖ ఆర్థోపెడిషియన్ బొండా సూర్యారావు అన్నారు. ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినోత్సవం సందర్భంగా స్థానిక భానుగుడి వద్ద ఉన్న ఒక ఆసుపత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వ్యాధి వస్తే నొప్పి తగ్గించడానికి మందులు, ఇన్ఫెక్షన్లు తగ్గించడానికి యాంటీబయోటిక్స్, రక్తమార్పిడి వంటివి చేయాలన్నారు. కొంతమందికి ఎముక మార్పిడి కూడా అవసరం కావచ్చునన్నారు. ఈ వ్యాధి ఉన్న వారు తగినంత ద్రవాలు తీసుకోవాలన్నారు. అనారోగ్యకరమైన ఆహారాలకు దూరంగా ఉండాలన్నారు. సమతుల ఆహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ వ్యాధి వారసత్వంగా వచ్చే రక్త రుగ్మత అన్నారు. ఈ వ్యాధి ఉన్నవారికి అలసట, బలహీనత, నొప్పి, చేతులు, కాళ్లు, వెన్ను నొప్పి, పొత్తి కడుపు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వస్తాయన్నారు.

మట్టి మాఫియా బరితెగింపు

- ఏలేరు గట్లపైన అక్రమ తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

పెద్దాపురం: మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. ఎక్కడ పచ్చని పంటపొలం, మెట్ట కనబడినా దానిని తవ్వి లక్షల్లో సొమ్ము చేసుకోవడమే ధ్యేయంగా కూటమి నేతల దందా సాగిపోతోంది. కోట్ల రూపాయలు విలువ చేసే రామేశంమెట్టపై ఇప్పటికీ రాత్రనక, పగలనగ నిత్యం గ్రావెల్ దందా కొనసాగిస్తూనే ఉన్నారు. ఇదిలా ఉండగానే కట్టమూరు రహదారిలోని పెద్దాపురం పట్టణ పరిధిలో తాత చెరువుపై కూటమి నేతలు కన్నేసారు. సర్వే నెంబర్ 62/19లో సుమారు 6.51 ఎకరాల తాత చెరువులో మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడుతూనే ఉన్నారు. దీనికి తోడు మండలంలో అతి పెద్ద చెరువు రాయభూపాలపట్నం రాఘవమ్మ చెరువులో స్థానిక నలుగురు చోటా నాయకులు నిత్యం రాత్రనక, పగలనక మట్టి తవ్వకాలను జోరుగా సాగిస్తున్నారు. ఇదీ చాలదన్నట్టు మండలంలోని వడ్లమూరు ఏలేరు కాలువ మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలకు అంతేలేదు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి కూడ చూడని పరిస్థితి. కూటమి నేతల కనుసైగతో గ్రావెల్, మట్టి వ్యాపారం లక్షల్లో జరుగుతోంది. ఎవరైనా పర్యావరణవేత్తలు ప్రశ్నిస్తే వారికి వార్నింగ్‌లు, అధికారులపై హుంకుం జారీ చేయడాలతో ఎదిరించే వారు లేక వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిపోతోంది. మండలంలో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు, ఇసుక దందాలపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

కాకినాడ రూరల్: యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాడా పీడీ ఎ.చైత్ర వర్షిణి, మెప్మా పీడీ ప్రియంవద, రూరల్ ఎంపీడీఓ సతీష్, ఆయుష్, పర్యాటక శాఖ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని యోగా గురువు జి.కృష్ణమోహన్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద గురువారం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు కృష్ణమోహన్ మాట్లాడుతూ శబ్ద, వాయు కాలుష్యం లేని ప్రదేశంలో గాలి, వెలుతురు ఉన్న చోట యోగాసనాలు వేయాలన్నారు. ఖాళీ కడుపుతో ఎటువంటి ఒత్తిడి, కోపం, భయం లేకుండా యోగా సాధన చేయాలన్నారు. బిగువైన దుస్తులు ధరించరాదన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యులు సూచనల మేరకు ఆసనాలు వేయాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.


కరప హైస్కూలులో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు


సూర్యారావుపేట బీచ్‌లో యోగాసనాలు వేస్తున్న ఎంపీ, రూరల్ ఎమ్మెల్యే తదితరులు


రమణయ్యపేటలో యోగాపై అవగాహన కల్పిస్తున్న గురువు కృష్ణమోహన్

మెగా యోగాలో అందరూ పాల్గొనాలి

కరప: ప్రపంచ యోగా దినోత్సవం–జూన్ 21న నిర్వహించే మెగా యోగాలో ప్రజలందరూ పాల్గొనాలని బీజేపీ కాకినాడ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల బీజేపీ అధ్యక్షురాలు యర్రంనీడి పద్మావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర–2025 ప్రాక్టీస్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈనెల 21న దేశవ్యాప్తంగా నిర్వహించే యోగాలో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు పి.లోవరాజు విద్యార్థులతో వివిధ యోగాసనాలు వేయించారు. హెచ్ఎం రాజరాజేశ్వరి, బీజేపీ రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు పుట్టా వీరప్రసాద్‌గాంధీ, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి రామకృష్ణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ గోవిందరాజులు, బి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు అన్నారు. స్థానిక దేవదాయశాఖ కార్యాలయంలో గురువారం కాకినాడలోని దేవాలయాలు, సత్రాలకు చెందిన ఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 21న కాకినాడలో జరిగే యోగా కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సత్రాల సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. కలెక్టర్ షణ్మోహన్ ఆధ్వర్యంలో స్థానిక నూకాలమ్మ గుడి వద్ద జరిగే యోగా కార్యక్రమంలో అందరూ పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా దేవాదాయశాఖాధికారి కె.నాగేశ్వరరావు, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

వృద్ధుడి ప్రాణాలు కాపాడిన డీసీపీఓ


వృద్ధుడిని జీజీహెచ్‌కు తరలించిన డీసీపీఓ, ఆయన బృందం

కాకినాడ క్రైం: స్థానిక కుళాయి చెరువు ఆవరణలో నడిరోడ్డుపై అపస్మారక స్థితిలో పడిఉన్న 60 ఏళ్ల వృద్ధుడి ప్రాణాలు నిలబెట్టి జిల్లా బాలల సంరక్షణాధికారి (డీసీపీఓ) వెంకట్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. వృద్ధుడు పడి ఉన్న ప్రాంతం మీదుగా వెళ్తున్న ఆయన అతడిని లేపి ఓఆర్ఎస్ తాగించి సపర్యలు చేశారు. ఆరోగ్యం క్షీణించి మాట్లాడలేని పరిస్థితిలో ఉన్న అతడిని ఆటో ఎక్కించి జీజీహెచ్‌కు తరలించారు. ఐసీడీఎస్ పీడీ, కలెక్టర్‌కు ఈ విషయాన్ని వివరించి సరైన వైద్యం అందేలా కృషి చేశారు. వృద్ధుడి శరీరం బాగా డీ హైడ్రేట్ అయ్యి క్షీణించినట్టు వైద్యులు తెలిపారు. అక్కడి సిబ్బంది వృద్ధుడి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాగా డీసీపీఓ వెంకట్‌ను, ఆయనకు సహకరించిన పీఓ ఐసీ కె.శ్రీనివాస్, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ పి.శ్రీనివాస్‌ను ఉన్నతాధికారులు అభినందించారు. వృద్ధుడు అపస్మారక స్థితిలో ఉన్నాడని కోలుకున్న వెంటనే తగిన సంరక్షణ కల్పించి హోమ్‌కు తరలిస్తామని వైద్యులు తెలిపారు.